

అప్పటి ఒలింపిక్స్ విజేతలకు దక్కేది. కానీ దానిపట్ల ఎవరికీ అభ్యంతరం ఉండేది కాదు. ఎందుకంటే... విజేతగా సమాజంలో దొరికే గుర్తింపునే అతి పెద్ద బహుమతిగా వారు భావించేవారు. అందుకే మహా మహా వీరులు సైతం ఈ పోటీల్లో పాల్గొని తమ సత్తా చాటే ప్రయత్నం చేసేవారు. తమ పౌరుడు ఈ పోటీలో గెలిస్తే, అతని రాజ్యమంతా గర్వంగా ఉప్పొంగిపోయేది. లియొనైడస్, మైలో లాంటి వీరులే కాకుండా అలెగ్జాండర్ I, నీరో లాంటి చక్రవర్తులు కూడా ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఒలింపిక్స్ మతపరమైన క్రతువులో భాగం కాబట్టి బలులు ఇవ్వడం, దేవతల పూజ, నృత్య ప్రదర్శనలు లాంటివన్నీ అందులో భాగంగానే ఉండేవి. ఈ పోటీలకు ఎంతగా ప్రాధాన్యత ఇచ్చేవారంటే... గ్రీకులో ఉన్న చిన్న రాజ్యాలన్నీ నిరంతరం కొట్టుకుంటున్నా... ఒలింపిక్స్ జరిగే సమయంలో శాంతి ఒప్పందాలను పాటించేవారు. ఈ స్ఫూర్తి ఆధునిక కాలంలో లేకపోవడం వల్లే మొదటి, రెండు ప్రపంచయుద్ధ సమయాల్లో మూడు ఒలింపిక్ పోటీలను రద్దు చేయాల్సి వచ్చింది.

నాటి ఒలింపిక్స్‌లో చాలా కొద్ది పోటీలను మాత్రమే నిర్వహించేవారు. పరుగుపందెం, మల్లయుద్ధం, లాంగ్ జంప్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, గుర్రపు రథాల పోటీ లాంటివే ఉండేవి. గ్రీక్ రాజ్యంలో పుట్టిన మగవారు మాత్రమే ఈ పోటీలకు అర్హులు. క్రమంగా గ్రీక్ మాట్లాడితే సరిపోతుందంటూ ఆ నిబంధన సడలించారు. కానీ మహిళలకు మాత్రం అవకాశం ఉండేది కాదు. పెళ్లయిన స్త్రీలు వాటిని చూసేందుకు కూడా అనుమతి లేదు. అయినా వాటిని ఆరాధించేవారికి కొదవ లేకుండేది. ఇలా దాదాపు ఏడు శతాబ్దాల పాటు సాగిన ఒలింపిక్స్ క్రీడలను, క్రీస్తు శకం 394లో... అప్పటి గ్రీక్ రాజ్యాన్ని పాలిస్తున్న రోమన్ చక్రవర్తి థియోడోసియస్ రద్దు చేశాడు. తనకు పరాయిదైన గ్రీక్ సంస్కృతికి ప్రతిబింబంగా ఈ క్రీడలను భావించడమే కారణం. ఇక ఆ తర్వాత వరదలు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు... నాటి ఒలింపియా ఆనవాళ్లను శిథిలాలుగా మార్చాయి. మళ్లీ ఆ స్ఫూర్తి తలెత్తేందుకు మరో 1,500 ఏళ్లు పట్టింది.

### ఒక వ్యక్తి సంకల్పం

ఫ్రాన్స్‌కు చెందిన పియరీ డి కొబెర్టిన్ మంచి విద్యావేత్తగా పేరు సంపాదించాడు. స్కూళ్లలో చదువుతోపాటు క్రీడలకు కూడా ప్రాముఖ్యం ఇవ్వాలనీ, అలాంటి ప్రాధాన్యత ఇవ్వడం వల్లే బ్రిటిషర్లు మంచి పురోగతి సాధించారనీ విశ్వసించాడు... వాదించాడు! కానీ తను ఆశించినంత మార్పు రాకపోవడంతో క్రీడలను ప్రోత్సహించేందుకు మరో ఆలోచన చేశాడు. అదే ఒలింపిక్స్. తన



లక్ష్యాన్ని ప్రచారం చేసేందుకు ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (ఐఒసి)ని స్థాపించాడు. ఒకప్పటి ఒలింపిక్స్‌కు పునర్వైభవం కల్పించాలనే తన ఆలోచన అందరికీ నచ్చడంతో, 1896లో అదే గ్రీక్ దేశంలోని ఏథెన్స్‌లో మొదటి ఆధునిక ఒలింపిక్స్ జరిగాయి. 14 దేశాలు పాల్గొన్న ఈ పోటీల్లో టెన్నిస్, షూటింగ్, జిమ్నాస్టిక్స్ లాంటి సరికొత్త క్రీడలన్నీ ఉండటంతో మంచి స్పందనే వచ్చింది.

### మన ప్రయాణం!

రెండో ఒలింపిక్స్ నుంచే ఒలింపిక్స్‌తో భారతీయుల అనుబంధం మొదలైంది. మన దేశంలో పుట్టిన బ్రిటిషర్ 'నార్మన్ ప్రిచార్డ్', 1900 ఒలింపిక్స్‌లో భారత్‌కి ప్రాతినిధ్యం వహించి రెండు పతకాలు సాధించాడు. అలా ఒలింపిక్ పతకం అందుకున్న తొలి ఆసియా దేశంగా భారత్ నిలిచింది. తర్వాత కాలంలో నార్మన్, గొప్ప హాలీవుడ్ నటుడిగా కూడా స్థిరపడటం మరో విశేషం. సరే! ఎంత ఇక్కడ పుట్టి పెరిగినా తను భారతీయుడు కాడు, అది మన విజయం కాదనే తోస్తుంది. ఆ లోటు తీరేందుకు ఏకంగా 52 ఏళ్లు పట్టింది. చాలామందికి కె.డి.జాదవ్ అనే పేరు తెలియకపోవచ్చు. దేశ ప్రజలే కాదు, ప్రభుత్వాలు కూడా తనను విస్మరిస్తూనే వచ్చాయి. మనకు తొలి వ్యక్తిగత పతకం అందించిన క్రీడాకారుడు తను. 1952లో ఫిన్లాండులో జరిగిన ఒలింపిక్స్‌లో, జాదవ్ మల్లయుద్ధంలో కాంస్య పతకాన్ని అందించాడు. మల్లవీరుల కుటుంబంలో పుట్టిన ఆయన క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. స్వాతంత్ర్యం వచ్చాక, అదే మువ్వన్నెల జెండాకు పతకాన్ని అందించాడు.



1952 హెల్సింకి ఒలింపిక్స్‌లో, జాదవ్ మల్లయుద్ధంలో కాంస్య పతకాన్ని సాధించాడు.

## ఇంతకీ ఎలా పాల్గొంటారు



ఒక ఆటలో రాణించే వ్యక్తి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి అంటూ వేర్వేరు దశల్లో తనను నిరూపించుకుంటూ వెళ్తాడు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు అంతర్జాతీయ పోటీలకు అర్హత వస్తుంది. వాటిలో తన ప్రదర్శన ఆధారంగా వచ్చే ర్యాంకింగ్స్‌తో ఒలింపిక్స్‌కి అర్హత సాధిస్తాడు. కొన్ని క్రీడలకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ కోటా ఇస్తుంది. ఆ కోటాలో ఎవరిని పంపాలనేది సదరు దేశాలు నిర్ణయిస్తాయి. ఇక జట్లుగా ఆడే ఆటల్లో కొన్ని పోటీలను ఒలింపిక్స్‌కి అర్హతగా భావిస్తారు. ఒక దేశం నుంచి ఏదన్నా క్రీడకు ఆటగాళ్లను పంపేటప్పుడు, వారి మధ్య క్వాలిఫయింగ్ పోటీలు నిర్వహించడమూ సహజమే. ఈ ఎంపికల్లో జాతీయస్థాయి ఒలింపిక్ కమిటీలది, ఒకో ఆటకు చెందిన అత్యున్నత సంస్థలదీ ముఖ్యపాత్రగా ఉంటుంది. సహజంగానే ఇందులో ప్రతిభతో పాటుగా పక్షపాతానికీ, బంధుప్రీతికీ ఆస్కారం ఉంటుంది. ఇన్ని దశలు దాటినా ఓ వ్యక్తి ఒలింపిక్స్‌కి అర్హత నేరుగా సాధించడు. తన బరువు, వైద్య పరీక్షల ఆధారంగా కొన్ని పరిమితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇంత చేసినా రెప్పపాటులో ఓడిపోయే అవకాశం ఎక్కువ. అందుకే ఏ ఒలింపిక్స్ పతకాన్నీ తీసుకు రాకున్నా... నాలుగో స్థానంతో సరిపెట్టుకున్న పీటీ ఉష, మిల్కాసింగ్‌లను దేశం ఇప్పటికీ గర్వంగా తల్చుకుంటుంది.

### హాకీ to హాకీ... మన ప్రాభవం!

వ్యక్తిగత క్రీడల్లో మన ఆటగాళ్లు తొలి పతకాన్ని సాధించడానికి చాలా దశాబ్దాలే పట్టింది. ఆధునిక ఒలింపిక్స్ జరిగిన వందేళ్లలో (1896–1996) కేవలం రెండే రెండు వ్యక్తిగత పతకాలు లభించాయంటే... మన దైన్యం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. అదృష్టవశాత్తు ఆ అవమాన భారాన్ని తగ్గించే ప్రయత్నం హాకీతోనే సాధ్యమైంది. అదే నూరేళ్ల వ్యవధిలో ఏకంగా ఎనిమిది బంగారు పతకాలను అందుకుంది మన హాకీ జట్టు. మనతో జరిగే ఆటలో ఓ ప్రత్యర్థి జట్టు, మనకు వ్యతిరేకంగా ఒక్క గోల్‌కి మించి చేసేందుకే నాలుగు దశాబ్దాలు పట్టిందంటే... ఒలింపిక్స్‌లో హాకీని మనం ఏ స్థాయిలో ఆడుకున్నామో అర్థం చేసుకోవచ్చు. ధ్యాన్‌చంద్ మాత్రమే కాదు ఉధమ్ సింగ్, రంగనాథన్, శంకర్ లక్ష్మణ్... లాంటి చారిత్రకమైన పేర్లెన్నో నాటి ప్రాభవానికి అలంబనగా వినిపిస్తాయి. అయితే రకరకాల కార